క్లుప్తంగా

వెండి వాహనంపై ముక్తిరామలింగేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం సైకతలింగానికి, రాజరాజేశ్వరి అమ్మవారికి, చండీ మాతకు విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వెండి వాహనంపై ఆశీనులను చేశారు. అనంతరం పురవీధుల్లో శివనామస్మరణలతో ఊరేగించారు.

వైభవంగా సీతారాముల గ్రామోత్సవం

మైదుకూరు : పట్టణంలోని పార్వతినగర్‌లో ఉగాది నుంచి 18 రోజుల పాటు శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహించారు. బుధవారం సీతారామ లక్ష్మణ హనుమ ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పార్వతి నగర్ నుంచి పూలాలంకరణ చేసిన వాహనంపై ఉత్సవ విగ్రహాలను మేళ తాళాలు, బాణసంచాతో మైదుకూరులో ఊరేగించారు.

శాంతిభద్రల పరిరక్షణే ధ్యేయం

బద్వేలు అర్బన్ : శాంతిభద్రల పరిరక్షణే ధ్యేయమని బద్వేలు అర్బన్ ఎస్ఐ–2గా కె.జయరామిరెడ్డి తెలిపారు. బద్వేలు అర్బన్ ఎస్ఐ–2గా కె.జయరామిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జిల్లాలో జరిగిన ఎస్ఐల బదిలీలలో అనంతపురం జిల్లాలో ఏఎస్ఐగా పనిచేస్తూ పదోన్నతిపై ఎస్ఐగా కడప జిల్లాకు నియమితులైన ఈయనను బద్వేలు అర్బన్ స్టేషన్ ఎస్ఐ–2గా నియమించారు. 1990లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన ఈయన హెడ్ కానిస్టేబుల్‌గా, ఏఎస్ఐగా అనంతపురం జిల్లాలోని వివిధ స్టేషన్లలో పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించి వారి ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రశాంతంగా సర్వసభ్య సమావేశం

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ సర్వ సభ్య సమావేశం బుధవారం సర్పంచ్ మోషా అధ్యక్షతన ప్రశాంతంగా జరిగింది. ఈ సమావేశంలో 14 మంది వార్డు సభ్యులు, సర్పంచ్ హాజరయ్యారు. 23 అభివృద్ధి పనులకు ఆమోదం పొంది, అంచనాలకు సఫారుసు చేశారు. హౌసింగ్ బోర్డు కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువ, మైలవరం ఉత్తర కాలువ పూడిక తీత, ఆచార్లకాలనీ, వీరభద్రస్వామి ఆలయం వద్ద కల్వర్టు నిర్మాణం వంటి పనులతోపాటు మరి కొన్ని పనులకు ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సమావేశానికి టూటౌన్ సీఐ సదాశివయ్య, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్ వెల్ డే

ప్రొద్దుటూరు కల్చరల్ : ఎస్ఆర్ఐటీ కళాశాలలో ఎంబీఏ ఫేర్‌వెల్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి మాట్లాడుతూ విద్యార్థులు అధ్యాపకులు చెప్పే పాఠ్యాంశాలను శ్రద్ధగా నేర్చుకుని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఏ సంస్థలో పనిచేసినా జూనియర్లకు సపోర్టు చేస్తూ సక్సెస్ సాధించాలని తెలిపారు. ఎంబీఏ హెచ్ఓడీ షబానాబీ, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి, కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరామర్శ



స్పందన సుబ్బరామిరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

ప్రొద్దుటూరు : స్పందన స్వచ్ఛంద సంస్థ అధినేత శెట్టిపల్లె సుబ్బరామిరెడ్డిని బుధవారం పలువురు ప్రముఖులు పరామర్శించారని సుబ్బరామిరెడ్డి తనయుడు స్పందన అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో శస్త్ర చికిత్స చేయించుకున్న సుబ్బరామిరెడ్డి మంగళవారం రాత్రి ప్రొద్దుటూరుకు తీసుకొచ్చారన్నారు. ఈ నేపథ్యంలో సూపర్ బజార్ రోడ్డులోని వారి స్వగృహంలో సుబ్బరామిరెడ్డిని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ప్రముఖ వ్యాపారి వంకదారి వీరభద్రయ్య, విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రముఖ్ మల్లికార్జునరావు, అరబిందో పాఠశాల కరస్పాండెంట్ కాశీప్రసాద్ రెడ్డి తదితరులు కలిసి పరామర్శించారు.

మంత్రి లోకేష్ మాట నిలబెట్టుకోవాలి

పోరుమామిళ్ల : కాశినాయన జ్యోతిక్షేత్రంలో ఫారెస్టు సిబ్బంది కూల్చివేసిన భవనాలను ఎప్పుడు పునర్మిస్తారని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ కూల్చిన ఘటనపై బహిరంగ క్షమాపణ చెపుతూ సొంత నిధులతో పునర్మిస్తారని చెప్పారని, ఇప్పటివరకు ఎలాంట పురోగతి కనిపించేదని చెప్పారు. కూల్చిన భవనాల పనులు త్వరితగతిన పూర్తిచేసి..మంత్రి లోకేష్ మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

రేషన్ బియ్యం మాయం!

- చోద్యం చూస్తున్న అధికారులు
- రేషన్ పంపిణీలో కోత
- పది నెలలుగా ఇదే పరిస్థితి
- ఆందోళనలో కార్డుదారులు



ఇంటింటికి పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం (ఫైల్)

గోపవరం : నెలనెలా ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు ఉచితంగా అందించే బియ్యం పంపిణీలో కొందరు డీలర్లు కక్కుర్తికి పాల్పడి పక్కదారి పట్టిస్తుండటంతో కార్డుదారులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సకాలంలో చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తుండటంతో డీలర్లు ఇష్టారాజ్యంగా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇదే పరిస్థితి మండలంలోని టీ.సండ్రపల్లె షాపు నెం. 18లో చోటు చేసుకుంది. సుమారు 300కు పైగా కార్డులు ఉన్న ఈ షాపుకు ప్రతి నెలా 60 క్వింటాళ్లకు పైగా బియ్యం సరఫరా అవుతున్నాయి. ఇందులో 50 క్వింటాళ్ల బియ్యం గోల్‌మాల్ జరిగింది. సంబంధిత డీలర్ నుంచి అధికారులు ఆ బియ్యాన్ని రికవరీ చేయకుండానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సదరు షాపును వీఆర్ఏ పేరు మీద డిపార్ట్‌మెంట్ వారు మార్చి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. అయితే ఈ షాపుకు సంబంధించి 50 క్వింటాళ్ల బియ్యం బ్యాక్‌లాగ్ చూపిస్తుంది. బ్యాక్‌లాగ్ పోను మిగిలిన బియ్యాన్ని సంబంధిత షాపుకు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఇది పది నెలలుగా కొనసాగుతూనే ఉంది. వచ్చే 10 క్వింటాళ్ల బియ్యంలో పాఠశాలలకు 3 క్వింటాళ్ల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. మిగిలిన 7 క్వింటాళ్ల బియ్యాన్ని ఎవరికి పంపిణీ చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. డీలర్ చేసిన బియ్యం గోల్‌మాల్‌కు కార్డుదారులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అధికారులు చర్యలు తీసుకోవాలి

ప్రతి నెల కార్డుదారుల నుంచి వేలు గుర్తు వేయించుకోవడం, బియ్యం ఆ నెలలో ఇస్తాం, ఈ నెలలో ఇస్తాం అని మభ్యపెడుతూనే ఉన్నారు. 5 కేజీలు ఇవ్వాల్సిన వారికి 2 కేజీలు ఇలా అనధికారికంగా కోతలు విధిస్తున్నారు. ఏప్రిల్ నెలకు సంబంధించి ఇప్పటి వరకు రేషన్ పంపిణీ జరగకపోవడంతో కార్డుదారులు అధికారులపై మండిపడుతున్నారు. ఎవరో చేసిన పాపానికి తామెందుకు నష్టపోవాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా దళితవాడ ప్రజలు నెలనెలా ఇచ్చే రేషన్ బియ్యంపై ఆధారపడి ఉన్నారు. ఇలాంటి వారి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. పక్కదారి పట్టిన 50 క్వింటాళ్ల బియ్యాన్ని సంబంధిత డీలర్ నుంచి ఎందుకు రికవరీ చేయలేకపోయారో తెలియడం లేదని, ఇందులో అధికారుల పాత్ర కూడా ఉందని కార్డుదారులు మండిపడుతున్నారు. పది నెలలుగా ఈ వ్యవహారం జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారని ప్రశ్నిస్తున్నారు.. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ప్రతి నెల బియ్యం కోత లేకుండా పంపిణీ చేయాలని కార్డుదారులు కోరుతున్నారు.

ప్రతి నెలా కోతే



పది నెలలుగా బియ్యం పంపిణీలో రెండు, మూడు కేజీలు కోత విధిస్తున్నారు. ఇదేమని అడిగితే పై నుంచి బియ్యం తక్కువ వస్తున్నాయని చెబుతున్నారు. మాకే ఎందుకు ఇలా జరుగుతుంది.

– గూడూరు నరసింహులు, టీ.సండ్రపల్లె దళితవాడ, గోపవరం మండలం

ఈ నెల బియ్యం ఇవ్వలేదు



ఏప్రిల్ నెలకు సంబంధించిన బియ్యం ఇప్పటి వరకు ఇవ్వలేదు. ప్రతి నెల బియ్యం తగ్గించి ఇస్తున్నారు. డీలర్‌ను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు. ఎన్నోమార్లు అధికారులకు తెలియజేశాం. పట్టించుకోలేదు.

– ఎం.చిన్న ఓబులేసు, టీ.సండ్రపల్లె దళితవాడ, గోపవరం మండలం

ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలి



ఉపాధ్యాయులను సన్మానించిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు

గోపవరం : ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మండల విద్యాశాఖాధికారులు చెన్నయ్య, రఘురామిరెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుత విజయాలు సాధించిన గోపవరం హైస్కూల్ ప్లస్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులను ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన మండల విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం చదివిన కె.శిరీష 944 మార్కులు, మొదటి సంవత్సరం చదువుతున్న కె.శృతి 434 మార్కులు సాధించడం అభినందించదగ్గ విషయమని, విద్యార్థులు కష్టపడి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. డీపీఆర్‌టీయూ, యూటీఎఫ్, ఎస్టీయూ, ఆపస్ సంఘాల నాయకులు మాట్లాడుతూ హైస్కూల్‌ప్లస్ జిల్లాలోనే ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రథమస్థానంలో నిలవడం మండల గౌరవాన్ని నిలిపారని, భవిష్యత్తులో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా మార్కులు సాధించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా హైస్కూల్‌ప్లస్ ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సత్యానందరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రవిశంకర్, ఓబుల్‌రెడ్డి, నరసింహారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, మునెయ్య, గోవిందు, నాగసుబ్బయ్య, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం నాగిరెడ్డి, ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ తుది ఫలితాల్లో ప్రతిభకనబరిచినట్లు పాఠశాల ఏజీఎం నాగిరెడ్డి తెలిపారు.

ఈ పరీక్షల్లో గ్రాండ్ ప్రైజ్ కింద ఐదు మంది విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు, ప్రథమ బహుమతి కింది 9 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు, 7 మందికి ద్వితీయ బహుమతులు, 14 మందికి తృతీయ బహుమతు లు, 15 మందికి నాలుగో బహుమతులు, 15 మందికి ఐదవ బహుమతితోపాటు కన్సోలేషన్, గోల్డ్‌మెడల్, మెరిట్ సర్టిఫికెట్లకు 618 మంది విద్యార్థులు ఎంపికయ్యారని వివరించారు. వీరిని ఏజీఎంతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ మురళీధర్, ప్రిన్సిపాల్ రహమతుల్లా, వినోద్‌కుమార్, కీర్తన, హైందవి, తమాలి, రమేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి



సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

చాపాడు : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రాజన్నకు ఫీల్డ్ అసిస్టెంట్లు వినతి పత్రం అందించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ గత 19 ఏళ్లగా విధులు నిర్వహిస్తున్నామని, తమ సేవలను గుర్తించి గ్రామ పంచాతీయ ఉద్యోగులుగా తమను క్రమబద్ధీకరించాలని కోరారు. మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అంతర్గత బదిలీలు చేయడం ద్వారా స్థానికుల ఒత్తిడిని తగ్గించాలని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లందరికి ఎఫ్‌టీఎఫ్ ఇచ్చి పూర్తి స్థాయి హెచ్‌ఆర్ పాలసీ, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా, గ్రాట్యూటీ వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని పేర్కొన్నారు. విధి నిర్వహణలో మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించి రూ.10లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని తెలిపారు. విద్యార్హత ఆధారంగా పదోన్నతులు కల్పించాలని, తమ సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

విత్తన షాపుల్లో తనిఖీలు



విత్తన ఏజెన్సీలో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారుల బృందం

ప్రొద్దుటూరు రూరల్ : ప్రభుత్వ అనుమతులు లేని కలుపు మందులను తట్టుకునే హెచ్‌టీ పత్తి విత్తనాలపై వ్యవసాయ అధికారుల బృందం బుధవారం పట్టణంలోని విత్తన విక్రయ దుకాణాలను తనిఖీ చేసింది. ఈ సందర్భంగా తనిఖీ అధికారి ఏడీఏ ప్రభాకర్ మాట్లాడుతూ హెచ్‌టీ పత్తి సాగును నిరోధించే నిమిత్తం రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తోందన్నారు. ఈ తనిఖీలలో ఇన్‌స్టంట్ కిట్లను ఉపయోగించి వివిధ కంపెనీల పత్తి విత్తనాలను పరిశీలిస్తున్నామన్నారు. తాము వేంపల్లె, పులివెందుల, ముద్దనూరు, జమ్మలమడుగు, రాజుపాళెం, దువ్వూరు, పోరుమామిళ్ల, మైదుకూరు, ప్రొద్దుటూరు మండలాల్లోని వివిధ కంపెనీల పత్తి విత్తనాలను, వాటి నాణ్యతను పరిశీలించామన్నారు. 25 రకాల పత్తి విత్తనాలను వ్యాపారులు రైతులకు విక్రయిస్తున్నారన్నారు. వీటిలో హెచ్‌టీ పత్తి విత్తనాలను ప్రాథమిక పరీక్షల ద్వారా తేలితే విత్తన చట్టం 1966, విత్తన నిబంధనలు 1968 యాక్టు కింద కఠిన చర్యలు చేపడుతామన్నారు. ఈ తనిఖీలలో ప్రొద్దుటూరు ఏడీఏ సురేష్‌రెడ్డి, ఏఓ శివశంకర్‌రెడ్డి, కడప డీఏఓ కార్యాలయ వ్యవసాయాధికారి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్‌ల తనిఖీ

మైదుకూరు : మైదుకూరులో బుధవారం విత్తన వ్యాపారుల లైసెన్స్‌లను వ్యవసాయ అధికారులు తనిఖీ చేశారు. వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ కార్యాలయం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విత్తన విక్రయ దుకాణాలను తనిఖీ చేసినట్టు ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. దుకాణాల్లో వివిధ రకాల కంపెనీలకు చెందిన పత్తి విత్తనాల నాణ్యతను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ సీడ్స్ విభాగం ఏడీఏ బి.భాస్కర్, ఏఓ శివశంకర్, జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం టెక్నికల్ ఏఓ గోవర్ధన్, మైదుకూరు మండల ఏఓ సుజన కుమారి పాల్గొన్నారు.

ఆర్టీసీతో ప్రజలకు మెరుగైన సేవలు



ఏపీఎస్ఆర్టీసీ పార్శిల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌వర్మ, విజయ్‌కుమార్

అట్లూరు : ప్రజలకు ఆర్టీసీ ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నామని బద్వేలు ఆర్టీసీ డిపో (డీఎంఈ) డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్‌వర్మ, జె.వి జయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం అట్లూరు మండల పరిధిలోని కొండూరులోని కడప–బద్వేలు ప్రదాన రహదారిపై పోలీస్‌స్టేషన్ దగ్గర పాలకొండు నారాయణరెడ్డి ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌లో బద్వేలు డిపో ఆధ్వర్యంలో ఏపీఎస్ఆర్టీసీ (లాజిస్టిక్) పార్శిల్ సర్వీసు సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ నుంచి ఏ ప్రదేశానికైనా ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో పార్శిల్ చేసుకోవచ్చని సూచించారు. అలాగే (ఏపీబీ)అడ్వాన్స్ పార్శిల్ బుకింగ్, (ఏటీబీ) అడ్వాన్స్ టికెట్ బుకింగ్ సౌకర్యం కూడా కల్పించామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అట్లూరు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రం వద్ద మజ్జిగను అందిస్తున్న డీఎస్పీ భావన

రాజుపాళెం : వాహనదారులు, బాటసారుల దాహార్తిని తీర్చుందేకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రొద్దుటూరు డీఎస్పీ పి.భావన తెలిపారు. రాజుపాళెం పోలీస్‌స్టేషన్ వద్ద బుధవారం ఎస్ఐ కత్తి వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీఎస్పీ ప్రారంభించారు. అనంతరం అక్కడున్న వారందరికి మజ్జిగ, మినరల్ వాటర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎండాకాలంలో ఇలాంటి చలివేంద్రాల వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎస్ఐతోపాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు రామకృష్ణారెడ్డి, సిద్ధయ్య, పోలీసులు పాల్గొన్నారు.

నేడు పశువైద్య కళాశాల వార్షికోత్సవం

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గోపవరం గ్రామ సమీపంలోని పశువైద్య కళాశాలలో గురువారం సాయంత్రం పశువైద్య కళాశాల 12వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి శ్రీవెంకటేశ్వర పశువైద్య యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జేవీ రమణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, పశువైద్య యూనివర్సిటీ డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్యలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



బద్వేలు అర్బన్ : గ్యాస్ లీకేజీ మంటలను ఆర్పే విధానంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



మైదుకూరు : అగ్ని ప్రమాదాల నివారణను మహిళలకు వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



పోరుమామిళ్లలో..



ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు మండలంలో..

బద్వేలు అర్బన్ : ప్రజలు అప్రమత్తతతో ఉంటే అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని ఇన్‌చార్జి ఫైర్‌ఆఫీసర్ బి.సుధాకర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని ఆర్.కె. అపార్ట్‌మెంట్స్‌లో మహిళలకు అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ లీకేజీ ప్రమాదాలను నివారించడం పూర్తిగా మనచేతుల్లోనే ఉందని, ఆ మేరకు నిబంధనలు పాటిస్తే ఎలాంటి గ్యాస్ ప్రమాదాలు జరగవని తెలిపారు. గ్యాస్ లీక్ అయ్యిందన్న అనుమానం తలెత్తినపుడు విద్యుత్ పరికరాలను ఆన్, ఆఫ్ చేయడం మంచిది కాదన్నారు. సెల్‌ఫోన్లు సైతం ఉపయోగించకూడదని సూచించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు బాధితులను రక్షించే విధానాలను ప్రయోగాత్మకంగా సిబ్బంది చేసి చూపించారు. అలాగే సీవోటు, డీసీపీ యంత్రాలు ఎలా వినియోగించాలో చూపించారు. కార్యక్రమంలో ఫైర్‌మెన్‌లు, అగ్నిమాపక సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై మహిళలకు అవగాహన

మైదుకూరు : అగ్ని ప్రమాదాలపై బుధవారం స్థానిక అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మహిళలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని చౌడేశ్వరి నగర్‌లోని అగ్నిమాపక కేంద్రం అధికారులు వారోత్సవాల్లో మూడో రోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ బి.సత్యరాజు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది చౌడేశ్వరి నగర్ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఏ విధంగా ఆర్పాలో ప్రయోగపూర్వకంగా వివరించారు.

పోరుమామిళ్ల : అగ్ని ప్రమాదాలపై బుధవారం స్థానిక అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇళ్లల్లో సంభవించే గ్యాస్ లీకేజీలు, వాటి నివారణ, వివిధ అగ్నిప్రమాదాల కారకాలు నివారణ ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ప్రజలతో నివా రణ చర్యలు కూడా చేయించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఓబుళపతి, సుహాస్‌బాషా, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎల్‌పీజీ గ్యాస్ పట్ల మహిళలకు అవగాహన

ప్రొద్దుటూరు క్రైం : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండలంలోని అమృతానగర్, ఖాదర్‌బాద్ గ్రామాల మహిళలకు బుధవారం అగ్నిమాపక సిబ్బంది ఎల్‌పీజీ గ్యాస్ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు అగ్నిమాపక అధికారి రఘునాథ్ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ దగ్గర ఎలాంటి మండే పదార్థాలు ఉంచకూడదన్నారు. వంట పూర్తి చేసిన ప్రతిసారి రెగ్యులేటర్‌ను పూర్తిగా ఆఫ్ చేయాలని చెప్పారు. ఇంటికి తాళం వేసి వెళ్లాల్సి వస్తే సిలిండర్ నుంచి రెగ్యులేటర్‌ను పూర్తిగా వేరు చేయాలన్నారు. గ్యాస్ లీకైనట్లు అనుమానం వస్తే ఇంట్లోని కరెంట్ స్విచ్‌లను ఆన్ చేయడం, ఆఫ్ చేయడం లాంటి పనులు చేయరాదని తెలిపారు. కిటికీల తలుపులు నెమ్మదిగా తెరవాలన్నారు. ఇంట్లో రెండు గ్యాస్ సిలిండర్లు ఉంటే వాటిని ఒకే చోట పెట్టరాదని, రెండో సిలిండర్‌ను బయట హాల్లో ఉంచాలన్నారు. గ్యాస్ ప్రమాదాలు, వాటిని ఎలా ఎదుర్కోవాలో డెమో ద్వారా మహిళలకు చూపించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

హోమ్‌లెస్ సెంటర్ తనిఖీ

మైదుకూరు : మైదుకూరులోని హోమ్‌లెస్‌ను సెంటర్‌ను బుధవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఖాజా మొయినుద్దీన్ ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రం నిర్వహణ సరిగా లేకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నిర్వహణకు సంబంధించిన రికార్డులు కేంద్రంలో లేకపోవడంతో సంబంధిత రికార్డులతో గురువారం కోర్టు ఎదుట హాజరుకావాలని న్యాయమూర్తి ఖాజామొయినుద్దీన్ ఆదేశించారు.

20న తిరుమలకు పాదయాత్ర

రాజుపాళెం : రాజుపాళెంలోని కోదండరామస్వామి దేవాలయం నుంచి ఈనెల 20న తిరుమలకు పాదయాత్రగా వెళుతున్నట్లు తిరుమల పాదయాత్ర కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పాదయాత్రకు వచ్చిన వారందరికి ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేస్తామని వారు పేర్కొన్నారు.

జామియా మసీదు అభివృద్ధికి కృషి



రికార్డులు అందుకుంటున్న మహబూబ్ బాషా

ప్రొద్దుటూరు కల్చరల్ : మజ్లిస్ ఏ జామియా మసీదు అభివృద్ధికి కృషి చేస్తానని నూతన మసీదు అధ్యక్షుడు పసపల మహబూబ్‌బాషా పేర్కొన్నారు. గౌని సర్కిల్‌లోని జామియా మసీదులో బుధవారం వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, ఆడిటర్ జనాబ్ వసీం అక్రమ్ నుంచి రికార్డులను అందుకుని బాధ్యతలు స్వీకరించారు. మసీదులో భక్తులకు అవసరమైన అన్నిసౌకర్యాలు కల్పించి మసీదు అభివృద్ధికి, ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. తనతోపాటు ఉపాధ్యక్షుడిగా వడ్ల బాబా బాషా, కార్యదర్శి బేపారి ఆరీఫ్ అహ్మద్, కోశాధికారిగా షేక్ దాదాపీర్, సభ్యులుగా ఉప్పలూరు సర్ఫ్‌రాజ్ హుస్సేన్, ముల్లా నసిరుద్దీన్, మల్లేల షేక్ మహమ్మద్ గౌస్‌పీర్, తంగేడుపల్లె షేక్ మైనుద్దీన్, సయ్యద్ మహమూద్ బాషా, షేక్ అబ్దుల్లా, షేక్ నిజాముద్దీన్‌లు బాధ్యతలు స్వీకరించారు. తనను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల ఏపీ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎండీ ఫారూక్, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ జనాబ్ అజీజ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ముఫ్తి జనాబ్ సయ్యద్ అబ్దుల్ మాలిక్, మౌజాన్ సనావుల్లా, షేక్ రియాజుద్దీన్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టం రాజ్యాంగ విరుద్ధం



ప్రొద్దుటూరు కల్చరల్ : సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్ అహ్మద్



బద్వేలు అర్బన్ : మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ పట్టణ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : వక్ఫ్ చట్టం రాజ్యాంగ విరుద్ధమని వక్ఫ్ పరిరక్షణ ఉద్యమం కమిటీ సభ్యుడు హుస్సేన్ అహ్మద్ పేర్కొన్నారు. స్థానిక వన్‌టౌన్‌లోని షాది ముబారక్ మంజిల్‌లో బుధవారం వక్ఫ్ పరిరక్షణ ఉద్యమం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ చట్టం రాజ్యాంగ విరుద్ధమని రాజ్యాంగంలోని 14, 15, 16, 25, 26, 300ఏ ఆర్టికల్లను ఉల్లంఘిస్తున్నాయన్నారు. అందుకే వక్ఫ్ చట్టాన్ని దేశ వ్యాప్తంగా ముస్లింలు, లౌకిక వాదులు, ప్రజాస్వామ్య వాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో జూలై 7వ తేదీ వరకు వక్ఫ్ పరిరక్షణ ఉద్యమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగానే రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ప్రకటించారు. జేఏసీ కోకన్వీనర్లు ఉమర్ బాషా, రామయ్య, జేఏసీ సభ్యులు రహమతుల్లా, ఎస్ఎం హిదాయతుల్లా, ఫయాజ్, పట్టణంలోని పలు మసీదుల ఇమాంలు, ముతవల్లిలు, మదరాసాల నిర్వాహకులు, పలు ముస్లిం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంను రద్దు చేయాలి

బద్వేలు అర్బన్ : వక్ఫ్ సవరణ చట్టంను రద్దు చేసేలా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, ఆదిల్‌లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ముస్లీం మైనార్టీలపైన అనేక రకాలుగా దాడులు చేయడమే లక్ష్యంగా పెట్టుకుని ఆ క్రమంలోనే వక్ఫ్ చట్టసవరణ బిల్లును తెరమీదకు తీసుకువచ్చిందని అన్నారు. వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకే మోదీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకువచ్చిందని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ముస్లీంలకు అనేక రకాల హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వానికి తొత్తులుగా మారి వక్ఫ్ సవరణ చట్టానికి మద్దతు పలకడం సరికాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేసేలా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని, లేకుంటే చరిత్రహీనులుగా మిగిలిపోతారని అన్నారు. సమావేశంలో పట్టణ ఉపాధ్యక్షులు యువరాజ్, నరసింహ పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం

పోరుమామిళ్ల : వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఈ బిల్లును వ్యతిరేకించాలని సీపీఎం నాయకులు కోరారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై ఈనెల 21న కడపలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించి బుధవారం పోరుమామిళ్లలో సీపీఎం మండల పార్టీ, ఆవాజ్ కమిటీ కరపత్రాలు ఆవిష్కరించారు చేశారు. ముస్లింలపై చట్టాల పేరుతో జరుగుతున్న దాడులను అందరూ ఖండించాలని కోరారు. కడప సమావేశాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి భైరవ ప్రసాద్, చాంద్‌బాషా, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి అబ్దుల్ గఫూర్, షరీఫ్, మహబూబ్‌పీరా, హుసేన్‌పీరా, ఖాజావలి, నాయబ్ పాల్గొన్నారు.